క్లుప్తంగా

నీలకంఠానికి ఎంఎస్ఎన్ చార్టీస్ అదనపు బాధ్యతలు



సామర్లకోట: కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్ అదనపు బాధ్యతలను స్థానిక పంచారామ క్షేత్ర ఈఓ బళ్ల నీలకంఠానికి అప్పగిస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు వీటి బాధ్యతలను పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షించేవారు.

ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ

సామర్లకోట: జర్మనీ భాషపై ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం కొండలరావు తెలిపారు. బుధవారం స్థానిక టీటీడీసీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఆన్‌లైన్‌లో ఈ ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, రెండేళ్ల పాటు క్లినికల్ అనుభవం ఉండాలన్నారు. జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసిన వారికి మూడేళ్ల పాటు క్లినికల్ అనుభవం ఉండాలని తెలిపారు. 35 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఎనిమిది నుంచి పది నెలల శిక్షణ అనంతరం బీ2 స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలని, అభ్యర్థులు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్, క్లినికల్ అనుభవ పత్రాలతో ఆగస్టు ఏడో తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 99888 53335 నంబరులో సంప్రదించాలన్నారు.

ఇంటర్మీడియెట్ విద్యా సంస్కరణలపై సమీక్ష

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ విద్యాసంస్కరణలపై గురువారం జిల్లా ఇంటర్మీడియెట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ఐ.శారద హాజరై సిలబస్‌లో వచ్చిన మార్పులు వివరించారు. గ్రూప్ సబ్జెక్టులలో పేపర్ వన్‌గా ఇంగ్లిష్, పేపర్-2తో ద్వితీయ భాషగా తెలుగు, ఉర్దులో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. సబ్జెక్టులలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, ఎకానమిక్స్, సివిక్స్, మైనర్ సబ్జెక్టులైన జాగ్రఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మోడ్రన్ లాంగ్వేజ్, ఎంపీసీ విద్యార్థులకు అడిషనల్ ఆరవ సబ్జెక్టు ఆప్షన్‌గా బయాలజీ, బైపీసీ విద్యార్థులకు అడిషనల్‌గా గణితం ఎంపిక చేసుకోవచ్చు. ఈ ఏడాది 2025-26కు గాను ప్రభుత్వ కళాశాలలో 3,888 మంది అడ్మిషన్ పొందారని తెలిపారు. సమావేశంలో జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రపంచీకరణతో ఆంగ్లానికి ప్రాధాన్యం

కాకినాడ సిటీ: ప్రస్తుతం ప్రపంచీకరణ కాలంలో ఆంగ్లానికి మరింత ప్రాధాన్యం ఏర్పడిందని మహారాష్ట్ర ధూలేలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ కాలేజీ ఆఫ్ లాకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వైభవ్ జె.సాబ్నిస్ అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో స్పీక్ స్మార్ట్ యాక్ట్ షార్ప్ మాస్టరింగ్ కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ఫర్ సక్సెస్ అనే అంశంపై జాతీయ స్థాయి వెబినార్ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వైభవ్ జె.సాబ్నిస్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రస్తుతం విద్యను నేర్చుకోవడమే కాకుండా, తమ భావాలను ఆంగ్లంలో వ్యక్తం చేయడం అవసరమన్నారు. ఆంగ్లంలో మాట్లాడడం ద్వారానే మంచి ఉద్యోగావకాశాలను పొందగలరని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అనంతలక్ష్మి ఈ వెబినర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించిన వారి సందేశాలను స్వీకరించి, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. మంచి భవిష్యత్తు కోసం అవకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.సంజూత, ఎం.సువర్చల, ఎం.వసంతలక్ష్మి, బి.సీతూప్రత్యూష, పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో సమస్యలు పరిష్కరించండి



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో అన్న క్యాంటీన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్థానిక సంత చెరువు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. అక్కడ తాగునీరు, డ్రైనేజీ సమస్యను గుర్తించారు. వెంటనే సంబంధిత అధికారులు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. క్యాంటీన్‌కు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎస్ఈ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్ ఉన్నారు.

ఆకు కూర.. ఆరోగ్య ధార

- పెరుగుతున్న ఆకుకూరల సాగు
- పుష్కలంగా పోషక విలువలు
- కొనుగోలుకు మొగ్గు చూపుతున్న ప్రజలు
- పెరటి సాగుకు మహిళల ఆసక్తి



పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నంలో సాగు చేస్తున్న ఆకు కూరలు

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆకు కూరలు భుజించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాంసాహారం కన్నా.. ఆకుకూరలు, కాయగూరలు తప్పనిసరిగా తీసుకోవాలంటూ సూచిస్తున్నారు. ఆకుకూరల్లో విటమిన్లు, లవణాలు, మాంసకృత్తులు, పీచు పదార్థం మెండుగా ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆకుకూరల సాగుకు గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. రైతులు పొలాల్లో ఆకుకూరలు విస్తారంగా సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట మండలాలతో పాటు, ఆయా పట్టణాల పరిధిలోనూ సుమారు 90 ఎకరాల్లో ఇవి సాగవుతున్నాయి. గృహిణులు కూడా తమ ఇంటి పెరట్లో తోటకూర, గోంగూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు పెంచుతూ, సొంతానికి వాడుకోవడంతో పాటు.. అదనంగా ఉన్న వాటిని అమ్మి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆకుకూరల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై పెద్దాపురం ఉద్యానవన అధికారి కె.సత్య శైలజ పలు సూచనలు చేశారు.

తోటకూర

ఈ విత్తనాలు చాలా చిన్నవిగా ఉంటాయి. వీటిని ఇసుకతో కలిసి తయారు చేసుకున్న నేలలో విత్తుకోవాలి. ఎకరానికి 3 నుంచి 4 కేజీల వరకు అవసరం అవుతాయి. పది కిలోల ఇసుకను కలిపి మడులపై పలచగా చల్లాలి. దానిపై పలుచని పొరలా మెత్తటి మట్టి లేదా ఇసుకతో కప్పాలి.

కొత్తిమీర

దీనిని విత్తుకునేటప్పుడు విత్తనాన్ని రెండు బద్దలుగా చేయాలి. లేకపోతే గింజ ఆలస్యంగా మొలకెత్తి, మొలక శాతం దెబ్బతింటుంది. దీని కోసం గింజలను నేలపై పోసి, సున్నితంగా నేలకేసి కొట్టాలి.

మెంతి కూర

ఇది పప్పు జాతి పంట. మొదటిసారి పొలంలో విత్తే ముందు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టిస్తే.. వాతావరణంలోని నత్రజనిని గ్రహించడానికి తోడ్పడుతుంది. దీని ద్వారా మెంతికూర మొక్కల పెరుగుదల బాగుంటుంది.

పాలకూర

విత్తనాలను 3.4 సెంటీ మీటర్ల లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువ అయితే మొలకలు సరిగా రావు. ఎకరానికి నాలుగు లేదా ఐదు కిలోల విత్తనాలు సరిపోతాయి. పాలకూర పంట త్వరగా చేతికందుతుంది.

కరివేపాకు

విత్తనాలను పండు నుంచి వేరు చేసిన వెంటనే నేలలో విత్తుకోవాలి. ఆరిన తరువాత విత్తితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది. విత్తిన 48 గంటల్లోగా నేలలో పదును చూసుకుని, లీటరు నీటికి నాలుగు లీటర్ల పిండి మిథాలిన్ కలిపి పిచికారీ చేయాలి. పంట తొలిదశలో కలుపు నివారించుకోవచ్చు.

నేల తయారీ, ఎరువులు

ఆకుకూరల సాగుకు నేల తయారీ చాలా ముఖ్యం. మెత్తటి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు, 3 లేదా 4 సార్లు సాధారణ దుక్కి చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట, 300 కిలోల వేప పిండి, 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధి చేసిన ట్రైకోడెర్మా, 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలి. తరువాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకుని, ఆకుకూరలను విత్తుకోవాలి. ఇలాంటి సస్యరక్షణ చర్యలు చేపడితే ఆకుకూరల్లో చీడపీడలు నివారించి, మంచి దిగుబడులు సాధించవచ్చు.

తక్కువ అవశేషాల మందులే వాడాలి



ఆకుకూర పంటలకు తక్కువ మందు అవశేషాలు ఉండే పురుగు మందులను మాత్రమే వాడాలి. పేను బంక, ఆకు తినే గొంగళి పురుగుల నివారణకు రెండు మిల్లీ లీటర్ల మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా వేప సంబంధిత పురుగు మందులను వినియోగించుకోవాలి. ఆకుమచ్చ తెగులు (సర్కోస్పర మచ్చ) నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు మందు పిచికారీ చేసిన తర్వాత కనీసం పది రోజుల వ్యవధి ఇచ్చి ఆకుకూరలు కోయాలి.

– కె.సత్యశైలజ, ఉద్యానవన శాఖ అధికారి, పెద్దాపురం



మెట్టలో సాగవుతున్న బీర పంట

ఎట్టకేలకు రెండు నెలల తర్వాత..

- నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం
- 50 అంశాలతో అజెండా



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: రెండు నెలల తరువాత మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎట్టకేలకు గురువారం జరగనుంది. సీడీఎంఏ నుంచి వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవికి ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు ఇవ్వడంతో ఆమె అధ్యక్షతన సమావేశం నిర్వహించడానికి కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ రెండో తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అనుమతి ఇవ్వాలని 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేసిన విషయం విదితమే. చైర్‌పర్సన్ పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నట్లు తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ గంగిరెడ్డి అరుణను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మే 15వ తేదీన చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి కలెక్టరు అనుమతించారు. అవిశ్వాస తీర్మానం పెట్టే ముందే చైర్‌పర్సన్ అరుణ హైకోర్టును ఆశ్రయించారు. మే 15న కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 25 మంది సభ్యులు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓట్లు వేశారు. వివాదం కోర్టులో ఉన్న కారణంగా అవిశ్వాస తీర్మానాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కోర్టులో చైర్‌పర్సన్ అంశం వచ్చే నెలకు వాయిదా పడింది. చైర్‌పర్సన్ అరుణ తాను విదేశాలకు వెళుతున్న కారణంగా రెండు నెలల పాటు అందుబాటులో ఉండనని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, డీఎంఏ నాగనరసింహారావుకు లిఖిత పూర్వకంగా తెలిపారు. దాంతో ఈ విషయాన్ని సీడీఎంఏ, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లడంతో వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. దాంతో ఆమె అధ్యక్షతన సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు లేకపోవడంతో గతంలో వాయిదా పడిన అంశాలతో పాటు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 50 అంశాలతో అజెండాను తయారు చేశారు.

జాబ్‌చార్టుపై ఎంపీడీఓలు అవగాహన పెంచుకోవాలి



ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న శ్రీలలిత

సామర్లకోట: ఎంపీడీఓల జాబ్‌చార్టుపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సీనియర్ ఎంపీడీఓ శ్రీలలిత మాట్లాడుతూ, ఎంపీడీఓలు వివిధ ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకం వంటి పథకాలను సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వారిదేనని తెలిపారు. పంచాయతీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పనితీరును పర్యవేక్షించే అధికారం ఎంపీడీఓలకు ఉంటుందన్నారు. అభివృద్ధి కార్యక్రమల పురోగతిపై ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని చెప్పారు. వివిధ పథకాల లబ్ధిదారులను గుర్తించి, వాటి ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. మండల పరిషత్ ఆర్థిక వ్యవహారాలను, బడ్జెట్ కేటాయింపులను పర్యవేక్షించాలన్నారు. అభివృద్ధి ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం చేయాల్సి ఉంటుందని తెలిపారు. పథకాల అమలులో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించుకోవాలన్నారు. ప్రాజెక్టుల కోసం ఆర్థిక వనరులను సమకూర్చాల్సి ఉంటుందన్నారు. మండల పరిషత్ సమావేశాలు సజావుగా సాగడానికి కృషి చేయాలన్నారు. ఫ్యాకల్టీలు కె.సుశీల, శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు.

స్టేషన్ సెంటర్‌లో పూడికతీత మొదలు



స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులో చేపట్టిన పూడికతీత పనులు

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో ఉన్న ప్రధాన డ్రైనులో పూడికతీత పనులు బుధవారం చేపట్టారు. నాలుగు నెలల క్రితం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూడికతీత నిర్వహించగా, తిరిగి ప్రధాన డ్రైనులో రైల్వే శాఖ ఆధ్వర్యంలో పనులు మొదలెట్టారు. ఈ ప్రధాన డ్రైను రైల్వే శాఖ పరిధిలో ఉంది. దీంతో రైల్వే ఉన్నతాధికారుల నుంచి పూడికతీత పనులకు నిధులు విడుదలయ్యాయి. వర్షాలు వచ్చిన సమయంలో రైల్వే స్టేషన్ ఆవరణ, క్వార్టర్స్‌లోకి నీరు రాకుండా ఉండేలా పూడికతీత పనులు చేపట్టినట్టు స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ తెలిపారు. రైల్వే స్టేషన్ ముఖద్వారం ఇన్‌గేట్, అవుట్ గేట్ల వద్ద ఉన్న కల్వర్టుల్లో కూడా పూడిక తీయిస్తామని చెప్పారు. గాంధీచౌక్ నుంచి ఏలేరు కాలువ వరకున్న డ్రైనులో పూడిక తీయించేలా నిర్దేశిస్తామన్నారు. స్టేషన్ సెంటర్‌లో రైల్వే డ్రైను వెంబడి ఉన్న తాత్కాలిక షాపుల వారికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, వాటిని తొలగించి పూడికతీత పనులు మొదలెట్టారు.

రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

ఎస్సై సునీత

కరప: బాలికలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై టి.సునీత అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. చెడు వ్యసనాలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ఎస్సై సునీత అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా, సోదరభావంతో మెలగాలన్నారు. ఈవ్ టీజింగ్ పేరిట తోటి విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ఉపాధ్యాయులకు తెలిస్తే తమ దృష్టికి తేవాలన్నారు. ఎవరైనా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా 112, 1930 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సెల్‌ఫోన్లలో అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయరాదని, వారు పంపే లింక్స్‌ను ఓపెన్ చేయరాదని, ఓటీపీలు చెప్పరాదని సూచించారు. పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్ తదితర అంశాలను వివరించారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్‌కు ప్రోత్సాహం

కరప: వ్యవసాయంలో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.విజయలక్ష్మి అన్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.11 వేలు, 57 మొక్కలను నూరు శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖ, సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ సంయుక్తంగా బుధవారం వేములవాడలోని రైతు యార్లగడ్డ భూపాల్ ప్రసాద్ ఆయిల్‌పామ్ తోటలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ మహోత్సవం-2025 జరిగింది. సర్పంచ్ కమిడి మంగాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు హెక్టారుకు రూ.27 వేల రాయితీ లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్క నాటిన సంవత్సరం నుంచి నాలుగేళ్ల వరకు సాగుకు వినియోగించే ఎరువులు, పురుగు మందులకు రూ.8,400 రాయితీ, అంతర పంటగా పండించే కూరగాయలు, అపరాల సాగుకు రూ.8,400 రాయితీ ఇస్తున్నట్టు వివరించారు. వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఎదురయ్యే నకిలీ విత్తనాల బెడద ఆయిల్ పామ్ సాగుకు ఉండదన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా 90 శాతం రాయితీతో ఆయిల్ పామ్ సాగులో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. మొక్క ఒకసారి నాటితే 25-30 ఏళ్ల పాటు నికర ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలన్నారు. సంస్థ జీఎం ప్రభాకరరావు మాట్లాడుతూ, వరిలో ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల ఎకరాకు రూ.1.50 లక్షల నికర ఆదాయం పొందవచ్చన్నారు. రైతు పండించిన ఆయిల్‌పామ్ గెలలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.వరప్రసాద్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో సూక్ష్మనీటి సేద్యానికి ఐదు ఎకరాల్లోపు రైతులకు 90 శాతం రాయితీ ద్వారా బిందు సేద్య పరికరాలు అందజేస్తున్నామన్నారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు మార్కెటింగ్ సమస్య, దళారీ వ్యవస్థ లేని పంట అని చెప్పారు. వేములవాడ పీఏసీఎస్ చైర్మన్ దూడల నారాయుడు, తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, ఎంపీటీసీ ఇమ్మిడిశెట్టి సత్య, ఇరిగేషన్, హౌసింగ్ ఏఈఈలు ఎన్.గంగాభవాని, పి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

‘కోట’కు చేరుతున్న హాకీ క్రీడాకారులు

సామర్లకోట: ఆగస్టు ఒకటి నుంచి కాకినాడలో జరిగే జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సామర్లకోటకు చేరుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం, రెవెన్యూ అకాడమీ, టీటీడీసీ ప్రభుత్వ కార్యాలయాల్లో బస ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం వరకు మిజోరాం, కేరళకు చెందిన క్రీడాకారులు వచ్చారని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, చండీగఢ్, హర్యానా, మహారాష్ట్ర నుంచి క్రీడాకారులు రావాల్సి ఉందన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు.

సొసైటీల బలోపేతానికి కృషి చేయాలి

పెద్దాపురం: సహకార సంఘాల బలోపేతానికి డీసీసీబీ కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పులిమేరు సహకార పరపతి సంఘం చైర్మన్‌గా డీసీసీబీ జిల్లా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ, సొసైటీలు బలోపేతమైతే డీసీసీబీ లాభాల బాటలో ఉంటుందన్నారు. తుమ్మల బాబు మాట్లాడుతూ, డీసీసీబీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసమన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ ఎంపీపీ గోపు అచ్యుతరామయ్య, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ తుమ్మల పద్మజ తదితరులు పాల్గొన్నారు.

‘దత్తత’తో ప్రతి ఉద్యోగి ఆదర్శంగా నిలవాలి

- ఆర్డీఓ శ్రీరమణి



కాండ్రకోటలో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: డివిజన్‌లో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత చేసుకుని ఆదర్శంగా నిలవాలని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. కాండ్రకోట గ్రామంలో మామిడి చక్రమ్మ కుటుంబాన్ని ఆమె దత్తత తీసుకున్న నేపథ్యంలో బుధవారం ఆ ఇంటికి వెళ్లి, కుటుంబ వివరాలు, వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనలో భాగంగా పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను గుర్తించినట్టు చెప్పారు. కుటుంబ సభ్యులతో ఏకాంతంగా సమావేశమై, వారి అవసరాలు తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తారని వివరించారు. కాండ్రకోటలో చక్రమ్మ కుటుంబంతో పాటు, నియోజకవర్గంలో మరో రెండు కుటుంబాలను తాను దత్తత తీసుకున్నట్లు వెల్లడించారు. ఆమె వెంట పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, సత్తిబాబు ఉన్నారు.

పలువురికి వంగా గీత పరామర్శ



చక్రబ్బాయిని పరామర్శిస్తున్న వంగా గీత, నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత బుధవారం పరామర్శించారు. యండపల్లికి చెందిన జ్యోతుల చంటిఅబ్బాయి, ఉప్పాడకు చెందిన సూరాడ కుమార్, నక్క సతీష్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో.. వారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఉప్పాడకు చెందిన ఉలవల నమశ్శివాయ తల్లి, వాకతిప్పకు చెందిన తాటికాయల చంద్రరావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలనూ వంగా గీత పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసరావు, రావు చిన్నారావు, జ్యోతుల చక్రబ్బాయి, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మెరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు, లొల్ల సత్యనారాయణ, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, బడే విజయ్‌కుమార్, పందిరి బాపిరాజు, గోపి హరిబాబు తదితరులు ఉన్నారు.

గుర్రపు డెక్కతో స్తంభించిన కాలువ



గుర్రపు డెక్కతో నిండిన భోగాపురంలో జంగం వారి కాలువ

- ఆందోళనలో రైతులు, గ్రామస్తులు

పిఠాపురం: రూ.కోట్లు వెచ్చించి పంట కాలువలను అభివృద్ధి చేస్తున్నట్టుగా చెప్పుకొంటున్న కూటమి నేతలు, అధికారులు.. అవసరమైన కాలువలను మాత్రం పట్టించుకోడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వందల ఎకరాల పొలాలకు సాగు నీరు అందించడంతో పాటు, గ్రామాల్లో అదనపు నీరు బయటకు వెళ్లే కాలువలను విస్మరిస్తున్నారు. పిఠాపురం మండలం భోగాపురంలో పంట కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో, గ్రామంలో ఏమాత్రం నీరు లాగని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు పంట కాలువ స్తంభించిపోయింది. ఈ కారణంగా గ్రామానికి చెందిన పంట పొలాల్లో నీరు నిలిచిపోయి రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇటీవల పనులు నిర్వహించినప్పటికీ, అధికారులు అతి ముఖ్యమైన ఈ కాలువను మాత్రం మర్చిపోయారు. పిఠాపురం మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావించినప్పటికీ, భోగాపురం గ్రామంలో అతి ముఖ్యమైన ఈ కాలువ గుర్రపు డెక్కను మర్చిపోవడం విస్మయం కలిగిస్తోంది. పంట కాలువ నుండి ఏటికి ఉన్న జంగం వారి కాలువగా పిలిచే ఇందులో గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో తొలగించకపోతే, గ్రామం సమీపంలోని పొలాలు మునిగిపోవటమే కాక, భోగాపురం గ్రామంలో పల్లపు ప్రాంతాలు కూడా జలమయమయ్యే అవకాశం లేకపోలేదు. ఈ కాలువలో పూడిక తొలగించాలని రైతులు అధికారులను అడిగితే, ఉపాధి హామీ పథకంలో ఈ కాలువ పనులు లేవని అంటున్నారు. ఈ కాలువ పనులు ఇరిగేషన్ క్లోజర్ పనుల్లో లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎవరికి వారే తమకు సంబంధం లేదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి, గుర్రపు డెక్కను తొలగించే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

స్మార్త విద్వత్ పరీక్షల్లో ఉత్తీర్ణత

అన్నవరం: సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు కాకినాడలోని వేద విజ్ఞాన ప్రతిష్టానం నిర్వహించిన స్మార్త విద్వత్ పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. దేవస్థానం స్మార్త ఆగమ పాఠశాలలో ఐదో సంవత్సరం స్మార్త విద్యనభ్యసిస్తున్న పది మంది విద్యార్థులు ఈ నెల 26న నిర్వహించిన పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావడంతో వేద విజ్ఞాన ప్రతిష్టానం ప్రశంసా పత్రాలు అందజేసిందని స్మార్త ఆగమ పాఠశాల ప్రధాన అధ్యాపకులు ఆరాధ్యుల లక్ష్మీనరసింహ మూర్తి తెలిపారు.